# మీ బిడ్డను నేను.. ఆశీర్వదించండి

- నాలుగేండ్లలో రూ.4వేల కోట్ల అభివృద్ధి
- దొంగమాటలు చెప్పే ఉత్తమ్‌కు బుద్ధి చెప్పాలి
- బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి
- నామినేషన్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చిన అభిమానులు



నామినేషన్ అనంతరం నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

నేరేడుచర్ల, నవంబర్ 9 : 'మీ బిడ్డనైన.. నన్ను వచ్చే ఎన్నికలో మరోసారి ఆశీర్వదించాలి' అని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కోరారు. గురువారం ఆయన హుజూర్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తాసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌ఓ సెంటర్‌లో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. సీఎం నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. యావత్ తెలంగాణ ప్రజానీకం మూడోసారి బీఆర్‌ఎస్ పార్టీ అధికారం చేపట్టి కేసీఆర్ సీఎం కావాలని కోరుకుంటున్నారన్నారు. 60ఏండ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రాన్ని దోచుకోవడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. 2019 ఉప ఎన్నికలో తనను గెలిపిస్తే రూ.4వేల కోట్లు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఉత్తమ్ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధిని పక్కన పెట్టి పేకాట క్లబ్బులు నడిపించే వారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు సైతం ఒకసారి ఆలోచించి దానిలో బానిసత్వం, వదిలి అభివృద్ధి చేసే బీఆర్‌ఎస్ వైపు రావాలని సూచించారు. ఉత్తమ్ ఎంత సేపు దొంగ మాటలు చెప్పి గెలవాలని చూస్తున్నాడని, గతంలోనూ తానే సీఎం అభ్యర్థినని చెప్పాడని పేర్కొన్నారు. ప్రస్తుతం సైతం అదే మాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్నాడన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో డజన్ మంది సీఎంలు ఉన్నారని ఎద్దేవా చేశారు. కొందరు బ్రోకర్లను నియమించి పాన్‌షాప్‌లు, టీస్టాల్స్ వద్ద తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని వాటిని ప్రజలు గమనించాలని సూచించారు. నియోజకర్గ ప్రజలే తన బిడ్డలని చెప్పుకునే ఉత్తమ్ ఇంత వరకు ఇక్కడ ప్రజలకు ఏం చేశాడని ప్రశ్నించారు. ఓటర్లను కొనేందుకు కారులో డబ్బులు తెస్తూ తగులబెట్టిన ఘనత ఉత్తమ్‌కే చెందిందని విమర్శించారు. ఇక్కడి ప్రజలందరూ తనను సైదన్న అప్యాయంగా పిలిస్తే, ఉత్తమ్‌ను సార్ అని పిలవాలన్నారు. 20ఏండ్లు పాలించిన కాంగ్రెస్ నియోజకవర్గానికి ఏం చేసింది.. తాను చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. 2019 ఉప ఎన్నికలో పద్మావతి ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పిన ఉత్తమ్ మాట తప్పాడన్నారు. ప్రస్తుతం మరో మారు 50వేల మెజర్టీ రాకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ప్రజలను మోసం చేస్తున్నారని, ఆయనకు మొత్తం ఆ ఓట్లే వస్తాయన్నారు. రాష్ట్రంలో మరో 20ఏండ్లు బీఆర్‌ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్ అధికారంలో ఉంటారని, హుజూర్‌నగర్‌లో సైతం బీఆర్‌ఎస్‌నే గెలుస్తుందన్నారు. తన వెంట ప్రాణాలర్పించే కార్యకర్తలు, అక్కలు, తముళ్లు, అన్నలు ఉంటే ఉత్తమ్ వైపు మొత్తం బ్రోకర్లు, దొంగలు ఉన్నారన్నారు. ఈసారి ఎన్నికలో గతంలో వచ్చిన మెజార్టీ కంటే ఎక్కువ మెజార్టీతో గెలుపొందుతామన్నారు. అంతకముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నామినేషన్‌కు తరలివస్తున్న సైదిరెడ్డిని వేద పండితులు, ముస్లిం మత పెద్దలు, పాస్టర్లు ఆశీర్వదించారు.

## గులాబీమయంగా హుజూర్‌నగర్

హుజూర్‌నగర్, నవంబర్ 9 : ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడి నామినేషన్ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో హుజూర్‌నగర్ పట్టణం గులాబీమయంగా మారింది. డప్పు వాయిద్యాల నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. సైదిరెడ్డి మాట్లాడుతున్నంత సేపు అభిమానులు ఈలలతో సందడి చేశారు. జై కేసీఆర్... జై సైదన్న నినాదాలు చేశారు. సుమారు 2గంటల పాటు ర్యాలీ కొనసాగింది. గుర్తును గుర్తుంచుకో రామక్క పాటకు ఎమ్మెల్యే డ్యాన్స్ చేసి అభిమానులను ఉత్తేజపర్చారు.

## ఐదుగురు సభ్యులతో నామినేషన్

ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి శుభముహూర్తమైన 11 గంటలకు అక్క చింతారెడ్డి కళావతి, అమరవీరుడు తల్లి కాసోజు శంకరమ్మ, మఠంపల్లి ఎంపీపీ పార్వతీ కొండా నాయక్, బీఆర్‌ఎస్ అడ్వైజర్ కమతం నాగార్జునతో కలిసి నామినేషన్ పత్రాలను ఆర్వో జగదీశ్‌రెడ్డికి అందించారు.

## తండాలను గ్రామ పంచాయతీలు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రమణనాయక్

రాష్ట్రంలోని తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసి వాటిని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రమణనాయక్ కొనియాడారు. గతంలో ఏ ప్రభుత్వమూ గిరిజనులను ఓటు బ్యాంక్‌గానే చూసింది తప్ప గిరిజన అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. అలాంటి నాయకుడికి, ప్రభుత్వానికి మద్దతుగా మనం మద్దతుగా నిలవాలని కోరారు.

కార్యక్రమంలో జడ్పీటీసీలు కొప్పుల సైదిరెడ్డి, జగన్‌నాయక్, ఎంపీపీలు లకుమళ్ల జ్యోతీభిక్షం, కొండా పార్వతీనాయక్, మండలాధ్యక్షులు అరిబండి సురేశ్‌బాబు, కిష్టిపాటి అంజిరెడ్డి, కృష్ణానాయక్, నాయకులు సుంకరి క్రాంతికుమార్, కడియం వెంకట్‌రెడ్డి, కొణతం సత్యనారాయణరెడ్డి, అమర్నాథ్ రెడ్డి, రాథోడ్ నగేశ్, చందమళ్ల జయబాబు, జక్కుల వీరయ్య, దొండపాటి అప్పిరెడ్డి, నాగంగ్ల శ్రీధర్, అనంతు శ్రీను, గురవయ్య, అంజయ్య పాల్గొన్నారు.

## రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను తగులబెట్టించిన నీచుడు ఉత్తమ్

- బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి



నియోజకవర్గంలో తన పబ్బం గడుపుకునేందుకు మాజీ సీఎం వైఎస్ విగ్రహాలను సైతం తగులబెట్టించిన నీచుడు ఉత్తమ్‌కు మార్‌రెడ్డి అని బీఆర్‌ఎస్ నాయకుడు గట్టు శ్రీకాంత్ రెడ్డి విమర్శించారు. రాజశేఖర్‌రెడ్డి మీద అభిమానం ఉన్న వారెవరూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయవద్దన్నారు. ఉత్తమ్ కొంతమంది దొంగలను పంపించి తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని వారిని కనిపెట్టి తరిమికొట్టాలన్నారు. పైసలిచ్చి గెలవొచ్చని అనుకుంటున్న ఉత్తమ్‌కు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

## సైదిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

- అమరవీరుడు తల్లి కాసోజు శంకరమ్మ



రాష్ట్రంలో కేసీఆర్ సారు... కారు... బీఆర్‌ఎస్ సర్కార్ రావాలంటే హుజూర్‌నగర్‌లో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని గెలిపించాలని అమరవీరుడు తల్లి కాసోజు శంకరమ్మ కోరారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం తపించే సైదిరెడ్డికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.



వేద పండితుల ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

## ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్రత్యేక పూజలు

హుజూర్‌నగర్ / మఠంపల్లి / మేళ్లచెర్వు, నవంబర్ 9 : ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి నామినేషన్ వేసే ముందు క్యాంపు కార్యాలయంలో సర్వ మతాల ప్రార్థనలు చేశారు. తొలుత వేద పండితుల దివ్వ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అదే విధంగా మఠంపల్లి మండలంలోని గుర్రంబోడు తండాలో సంత్ సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు చేశారు. మేళ్లచెర్వు స్వయంభూ శంభులింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.



నామినేషన్ వేసిన అనంతరం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న బీఆర్‌ఎస్ శ్రేణులు

## నామినేషన్‌కు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న పాలకవీడు బీఆర్‌ఎస్ నాయకులు



నేరేడుచర్ల నుంచి హుజూర్‌నగర్‌కు తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



కాంగ్రెస్ నాయకులకు గులాబీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

## బీఆర్‌ఎస్ గడపగడపకు ప్రచారం



హుజూర్‌నగర్ రూరల్ : మర్రిగూడెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



గరిడేపల్లి : పొనుగోడులో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

హుజూర్‌నగర్, నవంబర్ 9 : బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి ఆధ్వర్యంలో పాలకవీడు మండలానికి చెందిన 50మంది కాంగ్రెస్ నాయకులు క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సైదిరెడ్డి సమక్షంలో గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ నియోజకవర్గ మరింత అభివృద్ధికి బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.